వేడుకగా రామలింగేశ్వరస్వామి పల్లకీ సేవ



కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి సోమవారం క్షీరాభిషేకం పూజను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేక పూజ అనంతరం వేదపండితులు క్షీరాభిషేకం పూజను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కామారెడ్డిలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీ గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, శోభారాణి, మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, కౌన్సిలర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి

కీసర: ప్రతి సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను శాఖల వారీగా విభజించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 6 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. నాగారం మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 2 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తాం

నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఆయా పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు భవానీనగర్ కాలనీలో సుమారు రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డుప నులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మున్సిపల్ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి మంజూరవుతున్నాయన్నారు. గ్రాంట్లు, మున్సిపల్ నిధులను సద్వినియోగం చేసుకొని తద్వారా ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'వెంకటాపూర్ ఆలయ భూముల క్రయవిక్రయాలు చేయొద్దు'

ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూముల క్రయవిక్రయాలు చేయరాదని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) భాగ్యలక్ష్మి తెలిపారు. వెంకటాపూర్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ... శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఘట్‌కేసర్, వెంకటాపూర్‌లో భూములు ఉన్నాయన్నారు. ఆలయ భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. అక్రమ నిర్మాణాలపై దళారులకు డబ్బులు ఇవ్వరాదని, ఆలయ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


గురువులకు సన్మానం



రచయిత శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మేడ్చల్: గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా పట్టణంలోని హరే రామ, హరే కృష్ణ మందిరంలో గురువులను సన్మానించారు. ప్రముఖ నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను, ప్రముఖ గురువులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. సమావేశంలో నరేంద్ర కృష్ణ, నర్సింలు, సాయిదీప్, రాజారామ్‌మోహన్, గిరిధర్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

జంతు సంతాన నియంత్రణ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో నిర్మిస్తున్న జంతు సంతాన నియంత్రణ కేంద్రాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలు ప్రాంతాల్లో కుక్కలు, కోతులు సంఖ్య విపరీతంగా పెరుగుతున్నందున వాటి నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జంతు నియంత్రణ కేంద్రాన్ని సుమారు రూ. 28 లక్షల సాధారణ నిధులతో నిర్మిస్తున్నామన్నారు. కమిషనర్ వేమనరెడ్డి, నాయకులు రవి, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో చెరువులు

- రాజకీయనేతల కనుసన్నల్లోనే అక్రమాలు
- పట్టించుకోని అధికారయంత్రాంగం
- సర్వత్రా వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం

నారం చెరువు పై భాగాన చదును చేసిన కబ్జారాయుళ్లు



మేడ్చల్: మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో ఉన్న చెరువులు కబ్జాల బారిన పడుతున్నాయి. అడ్డుకోవాల్సిన యంత్రాంగం మొద్దునిద్రలో ఉందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు నగర శివార్లలో ఉన్న చెరువులు, కుంటల సంరక్షణకు హైడ్రా వంటి నూతన పాలక వ్యవస్థను తీసుకొస్తున్నా కబ్జారాయుళ్ల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. చట్టంలో ఉన్న చిన్నచిన్న లొసుగులను ఆసరా చేసుకుని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారుల అండదండలతో చెరువు భూములను యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

- నగర శివార్లలో ఉన్న మేడ్చల్ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. ఈ నేపథ్యంలో చెరువుల అంచున ఉన్న భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. శిఖం భూములను, పంట కాలువల భూములను, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూములను కబ్జాచేస్తూ అందినకాడికి దోచేస్తున్నారు.
- మండలంలోని అత్వెల్లి పెద్ద చెరువు, గుండ్ల పోచంపల్లిలోని సుమారు చెరువు, నారం చెరువు, సుతారిగూడలోని పెద్ద చెరువు, గౌడవెల్లిలోని చెరువులు, మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువు కబ్జాలకు గురవుతున్నాయి.
- అన్ని చెరువు పై భాగంలో వెంచర్లు వెలుస్తుండటంతో ఆయాప్రాంతంలోని భూములు కబ్జాల పాలవుతున్నాయి. ప్రధానంగా రియల్ వ్యాపారులు చెరువు శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను చదును చేస్తూ తమ వెంచర్లలో కలిపేసుకుంటున్నారు.
- శిఖం, ఎఫ్‌టీఎల్ భూములలో శాశ్వత కట్టడాలు చేయకుండా వాటిలో గడ్డి, చెట్లు పెంచుతూ వెంచర్‌కు అవి గార్డెన్ ప్రాంతాలుగా చూపుతున్నారు. చెరువుకు దూరంలో ఉండే స్థలాలను ప్లాట్లుగా మార్చి కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు.
- పేరుకు అన్ని అనుమతులు ఉన్నట్లు చూపుతున్నా వాస్తవంగా అవి కనిపించడం లేదు. హెచ్‌ఎండీఏ అనుమతులు పొంది అధికారుల కంటికి చిక్కకుండా కబ్జాలు చేస్తూ చెరువుల కబ్జాకు కుట్రలు పన్నుతున్నారు.
- మేడ్చల్ పెద్ద చెరువులో, తుమ్మ చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలు కనబడుతున్నా హద్దు రాళ్లు లేకపోవడంతో అది కనబడటం లేదు. గుండ్లపోచంపల్లి సుమారు, నారం చెరువులలోని శిఖం భూములను, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను చదును చేస్తూ ప్లాట్లుగా మారుస్తున్నా కనీసం విచారణ చేసే వారే కరువయ్యారు.
- మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి దాదాపు 15 చెరువుల వరకు 20 వరకు కుంటలు ఉన్నాయి. ఏ చెరువు వద్దకు, ఏకుంట వద్దకు వెళ్లి చూసినా ఎదో ఒక చోట కబ్జా కనిపిస్తుంది.

అంతా బహిరంగ రహస్యమే...

చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు, గ్రామాలలో రాజకీయ పార్టీల నాయకులకు తెలిసినా ఎవరికి చెందాల్సినవి వారికి అందుతుంటడంతో ఎవరికి వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. బ్లాక్‌మెయిల్ కోసం కొంతమంది ఫిర్యాదు చేసినా అవి ఫిర్యాదు స్థాయిలోనే నిలిచిపోతున్నాయనే ఆరోపణలున్నాయి.

- గ్రామాలలో చెరువుల పరిరక్షణకు గతంలో పటిష్ట వ్యవస్థ ఉండేది. చెరువులపై వంశపారపర్యంగా కొన్ని కుటుంబాలు కాపలా ఉండేవి. తాజాగా అలాంటి వ్యవస్థ లేకపోవడంతో కబ్జాదారులకు అడ్డేలేకుండా పోతోంది. చెరువుల చుట్టూ వెంచర్లు వెలుస్తుండటం, చెరువుల వద్ద ఉన్న వెంచర్లకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రియల్ వ్యాపారులు లక్షలు ఖర్చు చేసైనా సరే కబ్జాలు చేస్తూ చెరువుల స్థలాలను వెంచర్లలో కలుపుకొని తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు.
- ప్రధానంగా గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలలోని చెరువులు కబ్జాలకు అధికంగా గురవుతున్నాయి. సుమారు చెరువు, నారం చెరువు, సుతారిగూడ చెరువు, అత్వెల్లి చెరువు, మేడ్చల్ చెరువులు, తుమ్మ చెరువు కబ్జా రాయుళ్ల బారిన పడి బోరుమంటున్నాయి. మరోవైపు మేడ్చల్ పెద్ద చెరువు అత్వెల్లి పెద్ద చెరువుల నుంచి వరద నీరు వెళ్లే కాలువలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. కాలువలు వెళ్లే ప్రాంతంలో వెంచర్లు ఏర్పాటు కావడంతో వ్యాపారులు కాలువలను ప్లాట్లుగా మార్చేస్తున్నారు.



సుమారు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి భూమిలో వెలసిన రేకుల ప్రహరీ, కబ్జాలు

మేడ్చల్ నుంచి పలువురు అధికారుల బదిలీ

ఈ నెలాఖరు వరకు మరికొందరి బదిలీపై చర్చ

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బదిలీల్లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన పలువురు జిల్లా అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలకు ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచటంతో మరి కొందరు జిల్లా అధికారులు కూడా బదిలీ కావచ్చునన్న చర్చ స్థానికంగా సాగుతోంది.

జిల్లా పరిశ్రమల శాఖ జేడీ పడాల రవీందర్ భువనగిరి–యదాద్రి జిల్లాకు బదిలీ కాగా, ఈయన స్థానంలో సంగారెడ్డి జిల్లా నుంచి ప్రశాంత్‌కుమార్ బదిలీపై రానున్నారు. ఇదే శాఖలోని ఏడీ వెంకటేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిర్మల సంగారెడ్డి బదిలీ కాగా, అక్కడ నుంచి రాధిక ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు కూడా స్వీకరించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి అరుంధతి భువనగిరి–యదాద్రి జిల్లాకు బదిలీ కాగా, ఏపీఆర్‌ఓ స్వర్ణలతకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. జిల్లా వైద్యశాఖలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేశ్వర్‌రావు సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా సీపీఓ మోహన్‌రావు, ఇన్‌చార్జ్ డీటీఓ యాదయ్య, భూగర్భ జలశాఖ అధికారి రేవతి తోపాటు నాలుగు ఏళ్ల పూర్తయిన పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బదిలీ అవుతారనే చర్చ జోరుగా సాగుతోంది.

రెవెన్యూ శాఖలో...

ఇప్పటికే జిల్లా నుంచి రెవెన్యూ శాఖలో ఐదారుగురు తహసీల్దార్ స్థాయి అధికారులు రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు బదిలీ అయ్యారు. మరికొందరు రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు కూడా బదిలీ కావచ్చనే ప్రచారం జరుగుతోంది.

బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సంఘాల నాయకులు సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ... జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో బాలుడు విహాన్ మృతిచెంది వారం రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదని ఆరోపించారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇంటిని కేటాయించాలని కోరారు. నేతలు షేక్ మస్తాన్‌బీ, చిరంజీవి, కిషోర్, యాదగిరి, శివనారాయణ, ప్రవీణ్‌కుమార్, మీర్జా, షేక్ షావలి, ఆదర్శనగర్ బస్తీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 75 ఫిర్యాదులు

సత్వరమే పరిష్కరించాలన్న కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమంలో 75 దరఖాస్తుల(ఫిర్యాదులు)ను ఆయన స్వీకరించారు. ఇందులో పింఛన్లు, ధరణి, గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉపాధి కల్పనకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. రైతు రుణమాఫీకి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. పలువురు దివ్యాంగులు పింఛన్లు రావటంలేదని వినతి పత్రం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిత బుగ్గి

- విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి
- పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శామీర్‌పేట్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటీలోని ఎక్సిలెన్షియా కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ... గంజాయి, డ్రగ్స్‌కు బానిసలుగా మారి చాలా మంది యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ అలవాటు వల్ల నేరాలు చేస్తూ చాలావరకు యువత ప్రస్తుతం శిక్షలు అనుభవిస్తున్నారన్నారు. ఫొటోలు, వీడియోలు ప్రదర్శిస్తూ మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్‌ఐ హారిక, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

సాక్షి, సిటీబ్యూరో: ఇరవై ఏళ్లుగా ఆశ వర్కర్లు వెట్టి చాకిరీ చేస్తున్నారని, ప్రభుత్వాలు మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నేత ఎం.రేవతి కళ్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ... డ్యూటీలో చనిపోయిన ఆశా వర్కర్ల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఆశ వర్కర్ల కనీసమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పద్మ, రాధ, కవిత కోమలత, మంజుల, సబియా, అనిత, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గణేష్, లింగస్వామి, రాజశేఖర్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అప్పుడే కలెక్టట్‌కు వచ్చిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌కు కూడా వారు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వివేక్ ఆశాల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

అడిషనల్ కలెక్టర్‌గా రాధికాగుప్తా బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా రాధికాగుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2021వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాధికాగుప్తా హన్మకొండ జిల్లా అడిషన్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా పని చేశారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్‌గా పని చేసిన అభిషేక్ ఆగస్త్య ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెల్సిందే. ఆయన స్థానంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా రాధికాగుప్తా మేడ్చల్ జిల్లాకు బదిలీపై వచ్చారు. దీనికి ముందు ఆమె మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆ తర్వాత జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(లోకల్‌బాడీస్)గా ఉన్న విజయేందర్‌రెడ్డి నుంచి రాధికాగుప్తా చార్జ్ తీసుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాను మార్యాదపూర్వకంగా డీఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు కృష్ణారెడ్డి, పూర్ణిమా, విజయకుమారి, రాజేందర్, పద్మ, సైదులు కలిశారు.

గాయత్రీదేవికి వెండి పీఠం వితరణ



గాయత్రీదేవి

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ గాయత్రి మహాక్షేత్రంలో కొలువైన శ్రీ గురు రాఘవేంద్రస్వామికి, అమ్మవారికి గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అలాగే అమ్మవారికి ముగ్గురు దాతలు వెండి పాదపీఠం, వెండి గొడుగును సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఎస్.వి.ఎల్.ఎస్.మూర్తి అమ్మవారికి వెండి ఆభరణాలను అలంకరించారు.

బంగారు మంగళసూత్రం గొలుసు స్నాచింగ్

కీసర: రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు మంగళ సూత్రం గొలుసుకు గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... నాగారం వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన అన్నారం స్వరూప(65) సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మెడికల్ షాపునకు వచ్చి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెలుతుంది. ఇంటికి సమీపంలోకి చేరుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రం, రెండు లాకెట్లు ఉన్న ఒక దారాన్ని లాక్కున్నాడు. బాధితురాలి కేకలు వేస్తూ అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించింది. అతను తప్పించుకొని పక్కనే నిలిపిన ద్విచక్రవాహనం ఎక్కి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని గుర్తించేందుకు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సాయం

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌జెండర్లకు ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం కింద రూ. 5 లక్షల సాయాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో 10 మంది ట్రాన్స్‌జెండర్లకు రూ. 50 వేల చొప్పున చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ట్రాన్స్‌జెండర్ సంక్షేమంలో భాగంగా గతంలో కూడా అర్హులైన 11 మందికి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున 5.50 లక్షలు అందజేసినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. 100 శాతం సబ్సిడీతో వారికి ఈ చేయూతను అందించటం ద్వారా ఉపాధికి తోడ్పాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో 26 మంది ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు అందజేశామన్నారు. ఈ కార్డులు ఇళ్ల మంజూరుకు దోహదపడతాయన్నారు. జిల్లాలోని చైల్డ్ కేర్ సంస్థల్లోని అనాథలైన చిన్నారులకు క్యాస్ట్, బర్త్ సర్టిఫికెట్లను కూడా ఈ సందర్భంగా పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, బాల రక్షక కో ఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.డి.ఇంతియాజ్ రహీం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'ఎంపవర్‌హర్ మహిళా మేళా'

అల్వాల్: సైనిక్‌పురిలోని ఎంకే.రావు మెమోరియల్ హాల్‌లో పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఎంపవర్‌హర్ మహిళా మేళా' నిర్వహించారు. సుమారు 50 మంది స్వయం ఉపాధి మహిళా వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించగా.. భారీ సంఖ్యలో సందర్శకులు హాజరై పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అనంతరం పింక్ సర్కిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 21 మంది పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు చెక్కు పంపిణీ చేస్తూ..

విద్యార్థుల్లో విజ్ఞానం వికసించేలా...

- ప్రభుత్వ బడుల్లో 'శిక్ష సప్తాహ'

సాక్షి, సిటీబ్యూరో: నూతన జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి 'శిక్షా సప్తాహ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు... ఈ నెల 30 వరకు రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. విద్యార్థులు సర్వతోభివృద్ధి చెందేలా ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకాంశంపై కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి హెచ్‌ఎంలు, సంబంధిత విద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు, సమాజంలోని ప్రభావ వర్గాలను ఇందులో భాగస్వాములయ్యేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 94,790 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. దానికి అనుగుణంగా తరగతుల వారీగా విభజించారు. నిర్వహణకు సంబంధించి జియో ట్యాగింగ్‌తో కూడిన ఫొటోలు, వీడియోలను రోజువారీగా విద్యాంజలి పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాలను ఎంఈవో, ఎంఎఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ చేసి భద్రపరచాలని మేడ్చల్–మల్కాజిగిరి డీఈఓ విజయ్ కుమారి అధికారులకు సూచించారు.

'బీసీ డిక్లరేషన్ మోసపూరితం'

మేడ్చల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన బీసీ డిక్లరేషన్ మోసపూరితమని బీజేపీ నాయకులు ఆరోపించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ డిక్లేర్ చేసిన బీసీ డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాయలంలో వినతి పత్రం అందజేశారు. హామీలు ఇచ్చి కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు ప్రేందాస్, మల్లేష్, అభిలాష్, ఈశ్వర్, అరుణ్‌కుమార్, మహేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మహిళ పుర్రె లభ్యం

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పట్టణంలోని అత్వెల్లి గ్రామ పరిధిలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద సోమవారం మహిళ పుర్రె లభించింది. వెంచర్ సెక్యూరిటీ సిబ్బందికి మహిళ పుర్రె, చీర, బ్లౌజ్, చేతి సంచి, చెప్పు కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఫోరెన్సిక్ సిబ్బందితో కలిసి ఆధారాలు సేకరించారు. ఆరు నెలల ముందు మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీధర్ తెలిపారు.